నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | మంగళవారం 7 మే 2024 | MAHABUBABAD

- కాంగ్రెస్, బీజేపీ దొందుదొందే..
- ఈ పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కులేదు
- మామునూరు ఎయిర్‌పోర్ట్, ఆజంజాహీ మిల్లు మూసివేతకు ఈ పార్టీలే కారణం
- సింగరేణిని ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు
- 'మీట్ ది ప్రెస్'లో బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్

ప్రజల సంక్షేమమే బీఆర్ఎస్ ఎజెండా..

మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్

హనుమకొండ చౌరస్తా, మే 6 : బీజేపీ, కాంగ్రెస్‌కు దేశంలో 28 రాష్ట్రాలు ఉన్నాయని, బీఆర్ఎస్‌కు మాత్రం ఒకే రాష్ట్రం... ఒకే ఎజెండా ఉన్నదని బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదన్నారు. తల్లిలాంటి పార్టీని మోసం చేసిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌కు వరంగల్ ప్రజలు ఓటు రూపంలో గుణపాఠం చెబుతారని, వరంగల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందన్నారు. తాను స్థానికుడిని అని.. తన బర్త్ సర్టిఫికెట్ ఇక్కడే దొరుకుతుందని, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు స్థానిక సర్టిఫికెట్ ఇక్కడ దొరకదన్నారు. తన మీద భూ కబ్జా ఆరోపణలు లేవు అని.. అలాంటివి ముందు కూడా చేయనన్నారు. ఉమ్మడి జిల్లాలో అనేక సహజ వనరులు ఉన్నా గతంలో ఆజంజాహీ మిల్లు, తోలు పరిశ్రమలకు మనుగడ లేకుండా చేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీ వరంగల్ ఎయిర్‌పోర్ట్, ఆజంజాహీ మిల్లును విధ్వంసం చేశాయన్నారు. సింగరేణి బొగ్గుకు అధిక ధర రావడం లేదని, ఇక్కడ పండే వరి, మిర్చి పంటలకు ధర రాక రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. భూపాలపల్లికి రైలు మార్గం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటును అడ్డుకున్న బీజేపీ, కాంగ్రెస్‌లు ఇప్పుడు సింగరేణిని ప్రైవేటీకరణ చేసి పెట్టుబడిదారుల చేతిలో తెలంగాణను పెట్టాలని చూస్తున్నాయని ఆరోపించారు. 20 సంవత్సరాల నుంచి భారత రాష్ట్ర సమితిలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేశానని, ఒక్క చిల్లి గవ్వ కూడా అవినీతికి ఆస్కారం ఇవ్వలేదన్నారు. దేశంలో మోదీ పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. మోదీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. దేశంలో రాబోయేది సంకీర్ణ ప్రభుత్వమని, ప్రాంతీయ పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, వరంగల్ పార్లమెంట్‌పై బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తానన్నారు. ఈ సందర్భంగా వేలేరు, శాలపల్లి, లక్ష్మీతండాకు చెందిన ప్రజలు సుధీర్‌కుమార్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. సీసీ రోడ్డు వేయాలని, దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య పాల్గొన్నారు.

మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వరంగల్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్

కాంగ్రెస్, బీజేపీల మోసాలపై చర్చ పెట్టాలి

- తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్ఎస్సే
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఎమ్మెల్సీ సిరికొండతో కలిసి విస్తృత ప్రచారం
- సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు

దౌలత్‌నగర్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, మే 6: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేసిన మోసాలపై ఇంటింటికి వెళ్లి చర్చ పెట్టాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని అన్నారం షరీఫ్, కల్లెడ, దౌలత్‌నగర్, చింతనెక్కొండ, ఏనుగల్లు, మల్యా తండా, చౌటపెల్లి, సోమారం, వడ్లకొండ, గోపనపెల్లి, కొంకపాక, పర్వతగిరి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి సమావేశాల్లో ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారితో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతలను అడుగడుగునా నిలదీయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలకు నమ్మకం పోయిందని, తెలంగాణ ప్రయోజనాలు, హక్కులు కాపాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని అన్నారు. కేంద్రంలో చక్రం తిప్పాలన్నా, కాంగ్రెస్ మెడలు వంచాలన్నా కారు గుర్తుకు ఓటు వేసి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలైన రుణమాఫీ, రూ. 500 బోనస్ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని వాటిని ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతుల మీద ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ఎన్నికల సంఘం అనుమతితో రైతు భరోసా, పంట నష్టం, రూ. 2 లక్షల రుణమాఫీ, 500 బోనస్ ఇవ్వాలని ఎర్రబెల్లి డిమాండ్ చేశారు. పాలన కంటే కుతంత్రాలకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలాపంతులు, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మోటపోతుల మనోజ్‌కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, ఎం భిక్షపతి, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ యుగేంధర్‌రావు, శ్రీనివాస్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అబద్ధాలకోరు సీఎం రేవంత్

బచ్చన్నపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- ఆరు గ్యారెంటీల అమలుపై ప్రశ్నిస్తే దూషణలు
- రైతుల రూ.2 లక్షల రుణమాఫీపై దాటవేత
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట, మే 6 : అబద్ధాలను ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసం ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను నిలిపివేయడమేగాక ఉద్యమ నేతను దూషిస్తున్నాడని మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్స్‌లో పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం, అతిథులుగా జడ్పీచైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చెరువులు, కుంటలు ఎండిపోయాయన్నారు. గోదావరి జలాలున్నా వీటిని నింపకపోవడంతో సాగునీరందక వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. రూ.2 లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 వరకు గడువు ఇవ్వాలని రైతులను కోరుతూ యాదగిరి నర్సన్న, కొమురెల్లి మల్లన్న సాక్షిగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఒట్లు వేస్తున్నారని అన్నారు. ధాన్యానికి బోనస్ రూ.500, పేద మహిళలకు నెలకు రూ.2500, ఆసరా పింఛన్ల మొత్తాన్ని డబుల్ చేస్తామని చెప్పిన హామీలు ఏమయ్యాయని పల్లా ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా క్యామ మల్లేశంను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు గోస : క్యామ మల్లేశం

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాగు నీరందక, కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం అన్నారు. డిసెంబర్ 9న రైతుల పంట రుణాలు రూ. 2లక్షల మాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పాడని విమర్శించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగలా ఉండేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తేనే రైతుల పక్షాన పోరాటం చేయగలమని, ఢిల్లీలో కేంద్రం మెడలు వంచి నిధులు తేగలమన్నారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ పూర్ణచందర్, వైస్ చైర్‌పర్సన్ మద్దికుంట రాధ, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కనకయ్యగౌడ్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి, నాయకులు కృష్ణంరాజు, వేముల విద్యాసాగర్‌గౌడ్, ఫిరోజ్, షబ్బీర్, నర్సిరెడ్డి, ముశిని రాజు గౌడ్, శివకుమార్‌పాల్గొన్నారు.

కేసముద్రం: ప్రచారం భాగంగా హోటల్‌లో పూరీలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

ఆ రెండు పార్టీలను నమ్మి మోసపోవద్దు

మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, మే 6 : కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి ప్రజలు మళ్లీ మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ప్రజలను కోరారు. సోమవారం కేసముద్రం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని విస్మరించిన బీజేపీకి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమోహన్, మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్, నాయకులు నీలం దుర్గేశ్, కమటం శ్రీనివాస్, మోడం రవీందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

మాట్లాడుతున్న దాస్యం, చిత్రంలో అభ్యర్థి సుధీర్

హసన్‌పర్తి : ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఎర్రగట్టు గుట్ట సమీపంలో గ్రేటర్ 1, 2, 55, 56, 65, 66 డివిజన్లు, హసన్‌పర్తి మండలంలోని వివిధ గ్రామాల బూత్ స్థాయి సమావేశం నిర్వహించగా అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి, దాస్యం హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్‌కు నమ్మక ద్రోహం చేసి, ఇతర పార్టీలో టికెట్ తెచ్చుకున్న వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, ఆత్మ మాజీ చైర్మన్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

- అద్భుతమైన పాలన ఇక దూరమైనట్టేనా
- మారుమూల ప్రాంత ప్రజలకు కష్టకాలం
- ఆందోళనలో ములుగు, భూపాలపల్లి జిల్లాల ప్రజలు
- ప్రశ్నార్థకంగా మెడికల్ కళాశాల, కలెక్టరేట్ పరిస్థితి
- ఇప్పటికే కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం
- కనుమరుగు కానున్న ఆచార్య జయశంకర్ పేరు
- అస్తిత్వానికి ప్రమాదమని మేధావుల ఆవేదన
- జిల్లాలో జోలికొస్తే ఉద్యమం తప్పదని హెచ్చరికలు

ప్రజలకు పరిపాలన చేరువ చేసే సత్సంకల్పంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏర్పాటుచేసిన కొత్త జిల్లాలు అభివృద్ధిలో పోటీపడుతూ అద్భుతమైన ప్రగతి సాధిస్తున్న క్రమంలో 'జిల్లాల రద్దు' ప్రకటన అయోమయానికి గురిచేస్తున్నది. మారుమూల ప్రాంతాల్లో మౌలిక, రవాణా సదుపాయాలు మెరుగుపడడమే గాక జిల్లాకేంద్రంలో సరికొత్త హంగులతో రూపుదిద్దుకున్న కొత్త కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, అధికార యంత్రాంగం అందుబాటులోకి వచ్చి సాఫీగా సాగుతున్న చిన్న జిల్లాలను ఎత్తివేస్తే ఈ ప్రాంత మనుగడ, అస్తిత్వం ప్రమాదంలో పడుతుందని అన్ని వర్గాల్లో ఆందోళన మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్నట్లే చేస్తే జిల్లాల్లో అభివృద్ధి కుంటుపడి, పాలన దూరమై పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందని, పరిపాలన భవనాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని భూపాలపల్లి, ములుగు జిల్లాల మేధావులు, ప్రజలు ఆవేదన చెందుతుండగా, జిల్లాల జోలికొస్తే ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ నేతలు, ఉద్యమకారులు హెచ్చరిస్తున్నారు.

- ములుగు/జయశంకర్ భూపాలపల్లి, మే 6(నమస్తే తెలంగాణ)

భూపాలపల్లిలోని సమీకృత కలెక్టరేట్

రద్దయితే మళ్లీ మొదటికే

జిల్లాలు తీసివేస్తే అభివృద్ధికి ఆటంకం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిన్న జిల్లాలు ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు చేరువ చేశారు. కలెక్టర్, ఎస్పీతో పాటు అధికార యంత్రాంగాన్ని జనానికి అందుబాటులోకి తెచ్చారు. అభివృద్ధిని పరుగులు పెట్టించారు. ఉద్యమ సమయంలో భూపాలపల్లిని జిల్లా చేస్తానని, జిల్లాకు జయశంకర్ సార్ పేరు పెడతానని మాట ఇచ్చి నిలబెట్టుకున్నారు. భూపాలపల్లికి జయశంకర్ జిల్లాగా నామకరణం చేసి అభివృద్ధికి బాట వేశారు. 11 మండలాలతో కొనసాగుతున్న భూపాలపల్లి జిల్లాలో అద్భుతమైన పాలన ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. మారుమూల ప్రాంతాలు సైతం అభివృద్ధి బాట పట్టాయి. దారే లేని పలిమెల మండలానికి రహదారి ఏర్పడింది. కాగా సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న జిల్లా రద్దు ప్రకటన ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నది. ఇంత మంచి పాలన ఇక లేనట్టేనా అని ప్రజలు నిరాశకు గురవుతున్నారు. జిల్లా రద్దయితే ఈ ప్రాంత అభివృద్ధి ఆగిపోతుందని, కొత్తగా ఏర్పాటుచేసిన మెడికల్ కళాశాల, కలెక్టరేట్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని, రియల్ ఎస్టేట్ రంగం ఇప్పటికే కుప్పకూలుతుందని, ఆచార్య జయశంకర్ పేరు కనుమరుగు కానున్నదని మేధావి వర్గం అభిప్రాయపడుతున్నది.

రియల్ రంగం ధమాల్

ములుగును కలిపి భూపాలపల్లిని జిల్లాగా మార్చడంతో రియల్ ఎస్టేట్ రంగం ఇక్కడ ఊహించని విధంగా పుంజుకుంది. ఆ తర్వాత ములుగును ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసినప్పటికీ ఆ ఊపు తగ్గలేదు. సింగరేణి సంస్థ బొగ్గు వెలికితీత కార్యకలాపాలు ఒకవైపు సమీపంలోనే జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మరోవైపు, దీనికి తోడు భూపాలపల్లి జిల్లాగా మారడం రియల్ రంగానికి కలిసొచ్చింది. గడిచిన పదేళ్లలో భూపాలపల్లి ముఖచిత్రమే మారిపోయింది. అనతికాలంలోనే భూముల ధరలు ఆకాశాన్నంటాయి. భారీ భవనాలు వెలిశాయి. ములుగులో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సైతం భూపాలపల్లిలో ఏర్పాటుచేయగా భూముల రిజిస్ట్రేషన్ కోసం జనం క్యూ కడుతున్నారు. ఇదిలా ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి 19 జిల్లాల రద్దు, లోక్‌సభ నియోజకవర్గాల వారీగానే కొత్త జిల్లాలు అంటూ ప్రకటనలు చేయడం, ఆ ప్రభావం రియల్ రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. ఒక్కసారిగా రియల్ రంగం చతికిల పడింది. భూపాలపల్లి, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లు బోసిపోతున్నాయి.

విద్యుత్ కాంతుల నడుమ ములుగు జిల్లా కేంద్రం (ఫైల్)

అభివృద్ధి ప్రశ్నార్థకమే..

భూపాలపల్లి జిల్లాను తొలగిస్తే అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారుతుంది. మెడికల్ కళాశాల, జిల్లా ఆస్పత్రి అప్‌గ్రేడ్, రాజుల కోటలా పోలీసు కార్యాలయం, జిల్లా కలెక్టర్ సముదాయం, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, కొత్త మండలాల ఏర్పాటు, గ్రామ పంచాయతీలుగా మారిన తండాలు, గ్రామగ్రామానికి రోడ్లు, ఆయుష్ ఆస్పత్రి ఏర్పాటు.. ఇలా ఎన్నడూ లేని అభివృద్ధి కళ్ల ముందు కనిపిస్తోంది. సీఎం ప్రకటనతో అంతలోనే కల చెదిరిపోనుందా?, పరిపాలనా కార్యాలయాన్ని మరో ప్రాంతానికి తరలిపోవాల్సిందేనా..? ఇక్కడి ఉద్యోగులంతా మరోచోటుకి వెళ్తే.. జోనల్ వ్యవస్థ తొలగిపోతే.. కొత్త ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ల పరిస్థితి ఏమిటి? మళ్లీ జోనల్ వ్యవస్థ ఏర్పాటయ్యేదాక నియామకాలు ఆగిపోవాల్సిందేనా?. ఇలా అనేక సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

'ములుగు వెలుగులు' మూణ్ణాళ్ల ముచ్చటేనా?

ములుగు జిల్లాను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తే చేరువైన పాలన దూరం కానున్నది. ఈప్రాంతం తన అస్తిత్వాన్ని కోల్పో యే ప్రమాదమున్నది. ఉద్యమ సమయంలో వనదేవతల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం అప్పటి సీఎం కేసీఆర్ ఈ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేశారు. ఇప్పుడు జిల్లాను ఎత్తివేస్తే నాటి పాలనా కష్టాలు తిరిగి పునరావృతం కానున్నాయి. వనదేవతలు నడియాడిన ఈ ప్రాంతానికి భంగపాటు కానున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఏర్పాటుచేసిన విధంగా మారుమూల ప్రాంతాల దూరం ఆధారంగా గ్రామపంచాయతీగా ఉన్న ములుగును 2019లో 11మండలాలతో రాష్ట్రంలో 33వ జిల్లాగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు అన్నిశాఖల అధికారులు రావడంతో పరిపాలనా సౌకర్యం మెరుగుపడింది. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాలు అభివృద్ధిలో ఇప్పుడిప్పుడే ఇతర జిల్లాలతో పోటీపడుతున్నాయి. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం, ప్రత్యేక జిల్లా కోర్టు, ఎస్పీ కార్యాలయానికి స్థలం కేటాయించగా నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మెడికల్ కాలేజీ నిర్మాణం కూడా ప్రారంభమైంది. జిల్లా రద్దు అయితే అభివృద్ధి పనులతో పాటు వీటన్నింటికి ఆటంకం ఏర్పడి ములుగు ప్రాంతం మరింత వెనుకబడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సీఎం ప్రకటనతో మార్కెట్ పడిపోయింది

భూపాలపల్లి జిల్లాగా మారిన తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊహించని విధంగా పుంజుకుంది. చుట్టుపక్కల మార్కెట్ రేట్ పెరిగింది. ఇదే ఊపుతో చాలామంది వ్యాపారులు భూములు కొని ప్లాట్లుగా మార్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో మార్కెట్ పడిపోయింది. జిల్లాలు మారుస్తారనే ప్రచారంతో రియల్ ఎస్టేట్ చతికిల పడింది. అందరం వెంచర్లు ఏర్పాటు చేసి కొనుగోలు చేసే వారి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

– గురిజాల శ్రీనివాస్, రియల్ ఎస్టేట్ వ్యాపారి

ములుగు కలెక్టరేట్

జిల్లా మార్చితే ఉద్యమమే

భూపాలపల్లి జిల్లాను కదిలిస్తే ఉద్యమం తప్పదు. ప్రజలకు పాలన చేరువ కావాలనే ఉద్దేశంతో కేసీఆర్ కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారు. చిన్న జిల్లాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. జిల్లా ఏర్పాటుతో చాలా అభివృద్ధి జరిగింది. సీఎం ప్రకటనతో అభివృద్ధి ఆగిపోయినట్లయింది. చిత్తశుద్ధి ఉంటే జిల్లా తరలిపోదని ప్రకటించాలి. లేకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రజలు ఉరికిచ్చి కొడ్తరు.

– గండ్ర జ్యోతి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు

ధాన్యం కొనడం లేదని ఆందోళన

కేసముద్రం మార్కెట్‌లో ధరలు తగ్గిస్తున్నారని రైతుల ఆరోపణ

కేసముద్రం, మే 6: కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఆరుబయట ధాన్యం, మక్కజొన్నలను కొనుగోలు చేయడం లేదని రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. యాసంగిలో సాగుచేసిన మక్కజొన్న, ధాన్యం చేతికొస్తుండడంతో విక్రయానికి తీసుకువస్తున్నారు. మార్కెట్‌లోని షెడ్లలో, ఆరుబయట మక్కజొన్న, ధాన్యాన్ని రాశులుగా పోశారు. అయితే, వ్యాపారులు షెడ్డులో ఉన్న ఉత్పత్తులకే ఈ –నామ్ టెండర్ వేశారు. మిగిలిన వాటికి టెండర్ వేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు మార్కెట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వాతావరణం సరిగ్గా లేనందున ఆరు బయట ఉన్న వాటిని ముందుగా కొనుగోలు చేయాల్సిన వ్యాపారులు, అందుకు విరుద్ధంగా షెడ్లలో ఉన్న వాటిని కొనుగోలు చేయడమేంటని ప్రశ్నించారు. కొనుగోలు చేసిన మక్కజొన్న, ధాన్యంలో కూడా ఒకటి రెండు రాశులకు ఎక్కువ ధర పెట్టి మిగిలిన వాటికి తక్కువ ధరలు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన మార్కెట్ కార్యదర్శి అమరలింగేశ్వరరావు వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రేపు మొదటగా ఆరుబయట ధాన్యానికి టెండర్ వేయిస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు.



కేసముద్రం మార్కెట్‌లో అధికారులతో మాట్లాడుతున్న రైతులు



భూపాలపల్లిలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధిచెప్పాలి

- భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర
- బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం

కృష్ణకాలనీ, మే 6 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుపు కోసం భూపాలపల్లి పట్టణంలోని కార్ల్‌మార్క్స్ కాలనీ, రాజీవ్‌నగర్ కాలనీల్లో సోమవారం ఆయన ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి తన మీద తనకే నమ్మకం లేక దేవుళ్ల మీద ఒట్లు వేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కల్యాణలక్ష్మీ పథకంలో భాగంగా ఇస్తామన్న తులం బంగారం, మహిళలకు నెలకు రూ. 2,500 ఏమయ్యాయని ప్రశ్నించారు. పదేండ్లు బీజేపీ అధికారంలో ఉండి కాళేశ్వరానికి జాతీయ హోదా, గిరిజన యూనివర్సిటీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ఎందుకు ఇవ్వలేదో చెప్పి ప్రజలను ఓట్లు అడగాలన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుక సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని గండ్ర కోరారు. ప్రచారంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.